## క్లుప్తంగా

### నెహ్రూనాయక్‌ను కలిసిన నాయకులు



**ములుగు:** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ నెహ్రూనాయక్ శుక్రవారం జిల్లాకేంద్రానికి రాగా జిల్లా సేవాలాల్‌సేనా నాయకులు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా గిరిజనుల సమస్యలను వివరించారు. కలిసిన వారిలో సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్‌నాయక్, విద్యార్థిసేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌నాయక్, జిల్లా నాయకులు రాహుల్, శ్రీకాంత్, వినోత్ తదితరులు ఉన్నారు.

### ఏజెన్సీ చట్టాలు అమలు చేయాలి

**వెంకటాపురం(కె):** షెడ్యూల్ ఏరియాలో ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలకు గుర్తింపు లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన సలహామండలి పది సంవత్సరాలుగా తెలంగాణలో ఏర్పాటు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఏజెన్సీ చట్టాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### సీఐ, ఎస్సైని కలిసిన నాయకులు



**ఏటూరునాగారం:** ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లను శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, గుమ్మడి సోమయ్య కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థితిగతులను పోలీసులకు వివరించారు. కార్యక్రమంలో బాలరాజు, కొప్పుల శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

### సన్మానం



**వాజేడు:** మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న బదే మనోజ్ బాలా సాహెబ్ నారాయణకేడ్‌కు బ్రాంచీకి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆయనను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి విక్రాంత్, సొసైటీ ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాథరాజు, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, ఖాజా వలి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

### నూతన భవనం నిర్మించాలి

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలంలో మెట్‌పల్లి పంచాయతీలోని బీరసాగర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు వచ్చిందని కలెక్టర్ స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిలా కార్యదర్శి కుమ్మరి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలిపోయే పరిస్థితుల్లో ఉందన్నారు. నూతన భవనాన్ని నిర్మించకుండా మళ్లీ మరమ్మతులు చేస్తున్నారని వాపోయారు. తక్షణమే నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

### పాము కాటుతో కాడెద్దు మృతి

**టేకుమట్ల:** పాము కాటుతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు అరికాంతపు రాజయ్య కథనం ప్రకారం రోజువారిలాగే ఇంటి ముందు గల పశువుల కొట్టంలో కట్టేసిన కాడెద్దును పాము కాటేసిందని ఉదయం 9గంటలకు కాడెద్దు అపస్మరణ స్థితికి చేరుకుని మృతి చెందినట్లు తెలిపారు. కాగా, కాడెద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని వేడుకున్నారు.

### విద్యుత్ షాక్‌తో గేదె..

**కాటారం:** విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మేడిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గడవేన కొమురయ్యకు చెందిన గేదె పశుగ్రాసం కోసం గ్రామ శివారులోని పొలాల్లోని వెళ్లింది. ప్రమాదవశాత్తు కిందకు వేలాడి ఉన్న ప్రధాన విద్యుత్ తీగను తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.



రామన్నగూడెం పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



వెంకటాపురం(ఎం): అమరావతి విద్యాలయంలో..



గోవిందరావుపేటలో యోగా చేస్తున్న బీజేపీ నాయకులు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ములుగు రూరల్: గురుకుల పాఠశాలలో యోగా దినోత్సవంలో పాల్గొన్న పోలీసులు

**ఏటూరునాగారం:** యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యుడు వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వర ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పేర్కొన్నారు. యోగాతో మనస్సు ఏకీకృతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు అర్జున్, ఉపాధ్యాయులు నల్లబోయిన కోటయ్య, సమ్మయ్య నూతి కృష్ణ మూర్తి, గాడిచర్ల రాజశేఖర్, ఎర్రబ్రల్లయ్య, పాలకుర్తి శ్రీనివాస్, పర్వతాల కుమార్, ముక్కెర భిక్షపతి పాల్గొన్నారు.

**రామన్నగూడెంలో..**

మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగా ఆసనాలను వేయించారు. యోగాతో కలిగే లాభాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, రమాదేవి, నర్సయ్య, రాంబాబు, వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, నాగేశ్వర్‌రావు, రాజమౌళి, వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపురం(కె):** మండల కేంద్రంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం యోగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ స్వామిరెడ్డి యోగా ఆసనాలు, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**ములుగు రూరల్:** ప్రపంచ యోగ దినోత్సవ వేడుకలను ములుగు మండలంలోని గిరిజన గురుకులు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం సీఆర్‌పీఎఫ్ కామాండెంట్ ఆర్ .కె పాండా ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ద్వితీయ కామాండెంట్ తివారి, మెడికల్ ఆఫీసర్ తరకేశ్వరి, ఇన్‌స్పెక్టర్ హనుమంతరావ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**వెంకటాపురం(ఎం):** మండల కేంద్రంలోని వేద వ్యాస ఉన్నత పాఠశాలతో పాటు లక్ష్మీదేవిపేటలోని అమరావతి విద్యాలయంలో శుక్రవారం యోగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ వల్లే కలిగే లాభాలను వివరిస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోశాల వీరమల్లు, వీరగాని రాజయ్య విద్యార్థులచే ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, పసునూటి రాజయ్య, ఆనందం, సుమలత పాల్గొన్నారు.

**గోవిందరావుపేట:** యోగా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు తేజరాజు ఆధ్వర్యంలో, చల్వాయిలోని హైస్కూల్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో యోగా గురువు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి రుద్రారపు సురేష్ మాట్లాడుతూ.. రోజు ఒక గంట ఉదయం యోగ చేస్తే ఎలాంటి జబ్బులు దరి చేరవని అన్నారు. యోగా గురువు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ..ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి రిలాక్స్ అవుతారని తెలిపారు. నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం క్రీడా మైదానంలో..



వెంకటాపురం(కె)లో..



చల్వాయి హైస్కూల్‌లో..

## నిధుల కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న రైతులు

**ములుగు రూరల్:** మండలంలోని జంగాలపల్లి చెరువు కట్ట మరమ్మతులకు నిధులు కేటాయింపుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం చెరువు కట్ట వద్ద రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువు కట్ట గత వర్షాకాలం వర్షాలకు కోతకు గురికావడంతో మరమ్మతులు చేయాలని కోరడంతో రూ.5లక్షల నిధులు కేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూనూరు అశోక్‌గౌడ్, జగన్, భిక్షపతి, రతన్, నాగరాజు, లక్ష్మీనర్సు, లక్ష్మయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

**చిట్యాల:** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2017–18 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుకున్న సమయంలో వారి తీపి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సుమలత, పూర్వ విద్యార్థులు కీర్తీ, ప్రవళిక, చందన, రమ్య, అనూష, నాగలక్ష్మీ, సృజన, కవిత పాల్గొన్నారు.

# అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఏటూరునాగారం:** అనుమానితులకు ఆశ్రయం కల్పించవద్దని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బూటారం గ్రామాన్ని సీఐ, ఎస్సైలు తనిఖీ చేసి గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గిరిజనులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం మొదలైందని విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంత మంది వారి స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామాల్లో చొరబడి తలదాచుకునే ప్రయత్నం చేస్తారని అలాంటి వారికి ఆశ్రయం కల్పించవద్దన్నారు. అలాంటి వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని తెలిపారు. గిరిజన గ్రామాల ప్రజలకు మేము అండగా ఉంటామన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సౌకర్యం కల్పించాలి



డీఎఫ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న మధుబాబు

**ఏటూరునాగారం:** మండలంలోని గుర్రాలబావి గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ యాదవ్‌కు గుర్రాలబావి గొత్తికోయగూడెం గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి గ్రామంలో చీకటిలోనే జీవనం గడుపుతున్నామని తెలిపారు. ఇళ్లలోకి తేళ్లు, విష పురుగులు సంచరిస్తూ ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వదిలేయడం జరిగిందన్నారు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలని అటవీ శాఖ అధికారులను వేడుకున్నారు. గతంలో విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాలు వేయడంతో ఈ ప్రాంతం రిజర్వు ఫారెస్టు అంటూ అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం వల్ల విద్యుత్ సరఫరా ఆగిపోయిందని వివరించారు. కాగా, ఈ విషయంపై ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కరిస్తామని డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దేవయ్య, గణేష్, నందయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్‌సార్‌కు ఘన నివాళి



ఏటూరునాగారం: జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలో శుక్రవారం జయంకర్ వర్ధంతిని నిర్వహించారు. మండలంలోని బస్టాండ్ ఆవరణలోని జయశంకర్ సార్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం మొదటి అడుగు వేసిన మేధావి అన్నారు. ఆయన అడుగుజాడాల్లోనే తెలంగాణ యువత నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఖలీల్, ఆయూబ్, నాయకులు బాలరాజు, ఎల్లయ్య, నర్సింహారావు, సులేమాన్, శ్రీనివాస్, గౌస్, నరేందర్, భాగ్య, లాలయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..**

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జయశంకర్ సార్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖాజాపాషా, తాడూరి రఘు, తహర్‌పాషా, చిన్నికృష్ణ, నాగరాజు, శ్రీనివాస్, ఫత్తెమహ్మద్, రాంబాబు, కాళ్ల రామకృష్ణ, నవీన్, చిన్ని పాల్గొన్నారు.



వాజేడులో..

**వాజేడు:** మండల పరిధిలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ సార్ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇరుప బాలాజీ ఆధ్వర్యంలో విద్యర్థులు జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# 'నీట్' పరీక్ష అక్రమార్కులను శిక్షించాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఏటూరునాగారం:** నీట్ పరీక్షలో పరీక్ష పత్రాలను లీకేజీకి పాల్పడిన అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నీట్ పరీక్ష లీకేజీ అక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ప్రకటించిన ఫలితాల్లో అనేకంగా అక్రమాలున్నాయన్నారు. 720 మార్కులకు 720 మార్కులు రావడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విఫలం వల్లనే ఈ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మెడికల్ విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, ఆయూబ్, ఎల్లయ్య, బాలరాజు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

**గణపురం:** మండలంలోని గొల్లపల్లి, బస్వరాజుపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై గణపురం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాతో పాటు, గుడుంబా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల ముడి సరుకును ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**టేకుమట్ల:** గుడుంబాను ఎవరైనా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో గుడుంబా విక్రయిస్తున్న ఇళ్లల్లో ఉదయం సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సాతుకు లక్ష్మి వద్ద 10 లీటర్లు, గిద్దెముత్తారం నుంచి గర్మిళ్లపల్లి వైపు వస్తున్న లంబడి తండాకు చెందిన బానోతు సారయ్య అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల గుటుంబాను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అందించారు.

# రేగులగూడెంలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వైశాలి

**మంగపేట:** మండలంలోని కోమటిపల్లి పంచాయతీ పరిధిలోని రేగులగూడెంలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా ఫీవర్ సర్వే నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ(స్థానిక సంస్థలు) ఆదేశాల మేరకు మలేరియా హైరిస్క్ ఏరియాలో నిర్వహిస్తున్న మాస్ ఫీవర్ సర్వే కార్యక్రమంలో భాగంగా కోమటిపల్లి సబ్‌సెంటర్ పరిధిలోని రేగులగూడెం కొత్తికోయగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రజలందరికీ మలేరియా ఫీవర్ సర్వే, సికిల్ సెల్ సర్వే నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య శిబిరంలో గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగమ్మ, ఏఎన్ఎం స్వరూప, జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రవితేజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# తహసీల్దార్ హామీతో దీక్ష విరమణ



దీక్ష విరమిస్తున్న ఆదివాసీలు

**వెంకటాపురం(కె):** కొమరంభీమ్ ఆదివాసీల భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ 12 రోజులుగా గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరహార దీక్షను శుక్రవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ ఇచ్చిన హామీతో విరమించారు. శుక్రవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, వెంకటాపురం సీఐ బండారి కుమార్ దీక్ష శిబిరం వద్దకు వెళ్లి ఆదివాసీల భూసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేదుకు కృషి చేస్తామని హామీ ఇవ్వటంతో దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పూనెం సాయి, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేయండి



మాట్లాడుతున్న భూక్య జంపన్ననాయక్

**ములుగు:** అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూక్య జంపన్ననాయక్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పదవతరగతి పాస్ అయితే రూ.10వేలు, గ్రాడ్యుయేట్ పూర్తి అయితే రూ.25వేలు, పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తయిన నిరుద్యోగులకు రూ.లక్ష, పీహెచ్‌డీ పూర్తి చేస్తే రూ.5లక్షల చొప్పున ఇస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యాజ్యోతిపథకాన్ని అమలుచేయనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని అన్నారు.

## ఎంపీని కలిసిన జెడ్పీటీసీ



**టేకుమట్ల:** వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి శుక్రవారం హనుకొండలోని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టేకుమట్ల మాజీ సర్పంచ్ పాలాల నరోత్తం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆడెపు సంపత్, తదితరులు ఉన్నారు.